తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 24- మార్చి 2026 | సంపుటి : 3 | సంచిక : 295 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# విద్యుత్ శాఖ సిబ్బంది కుటుంబాలకు రూ.1 కోటి బీమా చెక్కులు

- విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం తోడ్పాటు
- కుటుంబాల భరోసాకు బీమా పథకాల విస్తరణ
- ఉద్యోగుల్లో మనోధైర్యం పెంచే చర్యలపై దృష్టి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యుత్ శాఖలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, ప్రతి కుటుంబానికి రూ.1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సమక్షంలో బాధిత కుటుంబాలకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మరణించిన ఓర్సు సురేష్, ముఖ్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా చెక్కులు అందజేశారు.

# మూసీ ప్రక్షాళనలో ప్రజలకు నష్టం ఉండదు

## ముఖ్యమంత్రి భరోసా

- పరివాహక ప్రాంత ప్రజలకు మెరుగైన పునరావాసం హామీ
- ప్రాజెక్టుపై సలహాలు స్వాగతం అమలు చేస్తామని స్పష్టం
- హైదరాబాద్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు వెల్లడింపు



**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టు అమలులో పరివాహక ప్రాంత ప్రజలను ఎవరినీ నిరాశ్రయులను చేయబోమని, వారికి మరింత మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇస్తూ, ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనకు సంబంధించిన ప్రణాళికలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ప్రజలకు ఉపయోగపడే సూచనలు అందిస్తే వాటిని తప్పకుండా అమలు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టును ఆపాలని కాకుండా మెరుగుపరచే దిశగా సలహాలు ఇవ్వాలని కోరారు. అవసరమైతే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి సూచనలు స్వీకరిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి విస్తృతంగా మాట్లాడారు. దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాల్లో ఎదురవుతున్న సమస్యలను ఉదాహరణగా తీసుకుంటూ, హైదరాబాద్‌ను మరింత మెరుగైన, జీవనానికి అనుకూల నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు వంటి అంశాలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం "తెలంగాణ రైజింగ్ 2047" దార్శనికతను వివరించిన ముఖ్యమంత్రి, రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి, కాలుష్య కారక పరిశ్రమలను బయటకు తరలించే చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

మిగతా 2లో

# శ్రీరామనవమి శోభాయాత్రకు హైదరాబాద్ సిద్ధం

- భారీ బందోబస్తుతో పోలీసుల ఏర్పాట్లు
- సీసీ కెమెరాలు, డ్రోన్లతో కట్టుదిట్టమైన నిఘా
- ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు సమన్వయ చర్యలు



**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్న శ్రీరామనవమి శోభాయాత్రను వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సిద్ధమయ్యాయి. సీతారాం బాగ్‌లోని ద్రౌపది గార్డెన్స్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పాల్గొని ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ శోభాయాత్రకు సుమారు 3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యాత్ర మార్గమంతా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఉంచుతామని చెప్పారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక క్రైమ్ టీమ్స్, మహిళల భద్రత కోసం షీ టీమ్స్ నిరంతరం పర్యవేక్షణలో ఉంటాయని స్పష్టం చేశారు.

మిగతా 2లో






# ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

- బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడంపై తీవ్ర అసహనం
- అర్ధరాత్రి అయినా కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, బెనిఫిట్స్ చెల్లింపుల విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండేళ్లుగా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించడంలేదని పలువురు రిటైర్డ్ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించగా, వారికి వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని గతంలోనే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే కోర్టు ఆదేశాలు ఇచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ బకాయిలు చెల్లించకపోవడంతో బాధితులు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాలని ముందే ఆదేశించింది. కానీ ఆదేశాలను పట్టించుకోకుండా ఆర్థిక కార్యదర్శి హాజరు కాకపోవడం న్యాయమూర్తిని తీవ్రంగా ఆగ్రహానికి గురిచేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాది అసెంబ్లీ సమావేశాల కారణంగా ఆర్థిక కార్యదర్శి హాజరు కాలేదని కోర్టుకు తెలియజేశారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, అసెంబ్లీ సమావేశాలు ముందుగానే తెలుసు కాబట్టి కోర్టుకు సమాచారం ఇవ్వాల్సిందని స్పష్టం చేశారు. ముందస్తుగా తెలియజేసి ఉంటే మినహాయింపు ఇచ్చేవాళ్లమని పేర్కొన్నారు.

మిగతా 2లో

# అసెంబ్లీ ముట్టడి ముందు బీజేపీ నేతల అరెస్టులపై తీవ్ర విమర్శలు

- ముందస్తు అరెస్టులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆక్షేపణ
- ప్రభుత్వంపై పోరాటాన్ని అణచివేతగా అభివర్ణన
- అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలనే డిమాండ్

**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి సిద్ధమైన బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన ముందస్తు అరెస్టులపై తీవ్ర రాజకీయ వివాదం నెలకొంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని పార్టీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు.

ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, అవినీతి, అరాచక పాలనతో రాష్ట్రాన్ని అధోగతి వైపు నెడుతున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సిద్ధమైన నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడమేనని విమర్శించారు. ప్రజల తరపున పోరాడే నాయకులను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని అన్నారు.

మిగతా 2లో





# ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం ప్రైవేట్ మెంబర్ బిల్లు

- స్పీకర్‌కు నోటీసు అందజేసిన కేటీఆర్
- అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు అనుమతి కోరిన బీఆర్ఎస్ నేతలు
- గ్యారంటీల అమలుకు చట్ట పరిరక్షణ లక్ష్యంగా బిల్లు



**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్న ఆరు గ్యారంటీల అంశంపై బీఆర్ఎస్ పార్టీ కీలక అడుగు వేసింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కేవలం రాజకీయ వాగ్దానాలుగా కాకుండా చట్టబద్ధ హక్కులుగా మార్చాలనే ఉద్దేశంతో ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ బిల్లు అమలులోకి వస్తే ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ఈ కీలక అంశాన్ని సభలో చర్చకు తీసుకురావడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా ప్రభుత్వం

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# విద్యుత్ శాఖ సిబ్బంది కుటుంబాలకు రూ.1 కోటి బీమా చెక్కులు

(మొదటి పేజీ తరువాయి)

బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంలో ముందుండిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగులు సేవల సమయంలో ఎదుర్కొనే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధమైన బీమా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాల విస్తరణపై కూడా ముఖ్యమంత్రి వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. సీపెక్ సర్వే ప్రకారం గుర్తించిన కుటుంబాలందరికీ రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తున్నామని చెప్పారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ప్రత్యేక కుటుంబ బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకు ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అసెంబ్లీ సమావేశాల సమయంలో నిర్వహించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించే విధంగా సంక్షేమ చర్యలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో పలు శాఖల మంత్రులు,



ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, భద్రతపై ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ చర్యలు బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంచుతాయని భావిస్తున్నారు.

# శ్రీరామనవమి శోభాయాత్రకు హైదరాబాద్ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

శోభాయాత్రను మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభించాలని, ఇరుకైన రోడ్లలో పెద్ద వాహనాల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ట్రయల్ రన్ నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. శబ్ద కాలుష్యం నియంత్రణకు డీజేలకు బదులుగా సాధారణ సౌండ్ సిస్టమ్ వినియోగించాలని, ఇతర వర్గాల మనోభావాలను దెబ్బతీయకుండా పాటలు, ప్రసంగాలు ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే వాహనాల ఎత్తు విషయంలో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శోభాయాత్ర నిర్వాహకులు ఎదురయ్యే సమస్యలను ప్రస్తావించగా, వాటిని పరిష్కరించేందుకు పూర్తి సహకారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం యాత్ర మార్గాన్ని అధికారులు పరిశీలించి, అవసరమైన చర్యలను గుర్తించారు. ఈ సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ కమిషనర్లు జోయల్ డేవిస్, ఎన్. శ్వేత, జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర ఉన్నతాధికారులు



పాల్గొన్నారు. నగరంలో శోభాయాత్రను సజావుగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

# అసెంబ్లీ ముట్టడి ముందు బీజేపీ నేతల అరెస్టులపై తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించే స్వరాలను అణచివేయడానికి అరెస్టులను ఆయుధంగా ఉపయోగించడం పిరికిపంద చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే భయపెట్టే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. అరెస్టులతో ప్రజల ఆగ్రహాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. జైలు గోడలు ప్రజా ఉద్యమాలను ఆపలేవని, అణచివేత ధోరణి ప్రభుత్వ పతనానికి దారితీస్తుందని ఈటల రాజేందర్ హెచ్చరించారు. ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎన్. రామచందర్ రావు మరియు ఇతర కార్యకర్తలను ఎటువంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తతను మరింత పెంచే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



# ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం ప్రైవేట్ మెంబర్ బిల్లు



(మొదటి పేజీ తరువాయి)

తన బాధ్యతలను మరింత పారదర్శకంగా నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు.

స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులను కేటీఆర్ మరియు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ చర్యతో ఆరు గ్యారంటీల అంశం అసెంబ్లీలో ప్రధాన చర్చాంశంగా మారే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పరిణామంతో రాష్ట్ర రాజకీయాల్లో చర్చలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆరు గ్యారంటీల అమలు, వాటికి చట్టబద్ధత కల్పించే దిశగా బీఆర్ఎస్ తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై బీఆర్ఎస్ నిరసన

- గన్ పార్క్ వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆందోళన
- పేద విద్యార్థుల సమస్యలపై ప్లకార్డులతో నిరసన
- అసెంబ్లీ వరకు ర్యాలీగా మారిన నిరసన కార్యక్రమం

**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్ పార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. విద్యార్థుల భవిష్యత్తుతో సంబంధం ఉన్న ఈ అంశాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. నిరసన సందర్భంగా నాయకులు "ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కొర్రీలు - పేద



విద్యార్థులకు వర్రీలు" అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు చదువులు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆలస్యాల వల్ల కళాశాలలపై కూడా ఆర్థిక భారం పడుతోందని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరసన అనంతరం గన్ పార్క్ నుంచి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పార్టీ కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొని ప్రభుత్వంపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగరంలో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారుతున్న నేపథ్యంలో, ఈ నిరసన కార్యక్రమం మరింత చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం త్వరగా స్పందించాలని బీఆర్ఎస్ నాయకులు మరోసారి డిమాండ్ చేశారు.

# మూసీ ప్రక్షాళనలో ప్రజలకు నష్టం ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

తద్వారా నగరాన్ని సేవల రంగ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని తెలిపారు. ఇక గోదావరి నీటిని నగరానికి తరలించి తాగునీటి అవసరాలు తీర్చడమే కాకుండా, మూసీ నదిలో నిరంతర ప్రవాహం కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ చర్యలతో నగరంలో పర్యావరణ పరిరక్షణతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మొత్తంగా మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి కీలకమని, ప్రజల సహకారంతో ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు నష్టం కలగకుండా,



మెరుగైన సదుపాయాలతో పునరావాసం కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని మరోసారి హామీ ఇచ్చారు.



# ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు ఆదేశాలను పట్టించుకోకపోవడం గంభీరమైన విషయమని, దీనిని తేలికగా తీసుకోబోమని న్యాయమూర్తి హెచ్చరించారు. ప్రభుత్వం తరఫున సముచిత సమాధానం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ధిక్కరణ చర్యలు తప్పవని సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈరోజు ఎంత రాత్రైనా ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని మరోసారి గుర్తుచేసింది. ఈ పరిణామం రాష్ట్ర పరిపాలనలో చర్చనీయాంశంగా మారింది.

# 12 ఏళ్ల తర్వాత కోలీవుడ్‌లో రోజా రీఎంట్రీ

**చెన్నై, మార్చి 23 తెలంగాణ ముచ్చట్లు):** సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా 12 ఏళ్ల విరామం తర్వాత కోలీవుడ్‌లోకి మళ్లీ రీఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవల శోభన తిరిగి తమిళ చిత్రాల్లో కనిపించనున్న నేపథ్యంలో, ఇప్పుడు రోజా కూడా సినిమాలపై దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది.

ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఇదే సమయంలో ఆమె నటిస్తున్న మరో చిత్రం అన్బే డయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

ఈ చిత్రంలో హీరోగా పారి ఎలవళగన్ నటిస్తుండగా, హీరోయిన్‌గా రమ్య రంగనాథన్ కనిపించనున్నారు. చెన్నై పెరంబూర్ నేపథ్యంలో సాగే ఈ ప్రేమ కథలో రోజా కీలక పాత్రలో—ప్రత్యేకంగా హీరో తల్లి పాత్రలో కనిపించనున్నారు.

ఇటీవల విడుదలైన 'పెరంబూర్ గానా' పాటకు మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఈ సాంగ్‌లో రోజా వేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు.

ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా, మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలవుతున్న పాటలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇక ఇటీవల రాధిక నటించిన 'తాయి కిళవి' విజయంతో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ మళ్లీ జోరందుకుంది. ఈ నేపథ్యంలో రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. మొత్తంగా, సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ తెరపై కనిపించబోతున్న రోజా—ఈ రీఎంట్రీతో మరోసారి తన సత్తా చాటుతారా అన్నది ఆసక్తికరంగా మారింది.





# రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన పోలీసు ఉన్నతాధికారులు

- డీజీపీ శివధర్ రెడ్డి సహా ఐపీఎస్ అధికారులు మర్యాదపూర్వక భేటీ
- పోలీస్ అకాడమీ, లాజిస్టిక్స్ విభాగాలపై చర్చలు
- రాజ్ భవన్‌లో జరిగిన సమావేశం

**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు రాజ్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, ప్రొవిజనింగ్ & లాజిస్టిక్స్ విభాగం ఐజీ గజరావు భూపాల్ పాల్గొన్నారు. ఈ భేటీలో రాష్ట్ర పోలీస్ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా పోలీస్ శిక్షణ, మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ నిర్వహణ వంటి అంశాలపై అధికారులు గవర్నర్‌కు వివరించినట్లు తెలిసింది. పోలీస్ అకాడమీ కార్యకలాపాలు, శిక్షణా విధానాలు, భద్రతా వ్యవస్థల బలోపేతంపై అధికారులు వివరాలు అందజేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను కూడా గవర్నర్‌కు తెలియజేశారు.

ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పోలీస్ శాఖ పనితీరును అభినందించినట్లు సమాచారం. ప్రజల భద్రత కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ సమావేశం రాష్ట్ర పోలీసు వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి వ్యక్తి మృతి

**కీసర, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఒక వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన వెలుగుచూసింది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన రవీందర్ (54) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కీసర ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో చెత్త లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్ లారీ వెనుక టైర్ల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పరారైన డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.





# బడ్జెట్‌లో బీసీలకు 'మొండిచేయి'.. ఈసీఐఎల్ చౌరస్తాలో టీఆర్‌పీ ధర్నా

**కాప్రా, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌పై తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో బీసీ సామాజిక వర్గాలకు ప్రాధాన్యం కల్పించలేదని ఆరోపిస్తూ సోమవారం కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించారు.పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో చౌరస్తాను హోరెత్తించారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 'కామారెడ్డి డిక్లరేషన్' హామీలను బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. బీసీ సంక్షేమానికి సంవత్సరానికి రూ. 20,000 కోట్లు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం, బడ్జెట్‌లో ఆ అంశాన్ని ప్రస్తావించకపోవడం బీసీలను వంచించడమేనని విమర్శించారు. బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీపై ప్రభుత్వం మౌనం వహించడం దురదృష్టకరమన్నారు.జిల్లా అధ్యక్షుడు పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500 అందించే మహాలక్ష్మి పథకం, నిరుద్యోగ భృతి వంటి హామీలకు తగిన నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ వైఫల్యమని పేర్కొన్నారు.జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్ మాట్లాడుతూ, ప్రభుత్వం తన మొండి వైఖరిని విడిచి సవరించిన బడ్జెట్‌లో బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, యువత, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్షలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లాలో పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా అనే అంశంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం శామీర్‌పేట్ మండలంలోని హాకీంపేట్‌లో ఉన్న తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని సూచించారు.ఈ సందర్భంగా పరీక్షా గదులను సందర్శించి విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, లైట్లు, ఫ్యాన్లు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అనే విషయాలను జిల్లా విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు.అలాగే పరీక్షా కేంద్రంలో మొత్తం హాజరైన విద్యార్థుల సంఖ్య, గైర్హాజరైన వారి వివరాలను కూడా సేకరించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితమైన పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, శామీర్‌పేట్ తహసీల్దారు సుచరిత తదితరులు పాల్గొన్నారు.





# సాయిసుధీర్ కళాశాలలో ట్రైఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

**కాప్రా, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

సాయి సుధీర్ డిగ్రీ & పీజీ కళాశాలలో రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ సహకారంతో "ట్రైఇంపాక్ట్ - సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్"ను సోమవారం ఘనంగా ప్రారంభించారు.విద్యార్థుల్లో పరిశోధన, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసిహెచ్‌ఈ) చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. బాలభాస్కర్ గౌరవ అతిథిగా, స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కె. సూర్యప్రకాశ్ గౌడ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె. నాగేంద్ర కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాల చైర్‌పర్సన్ ఆర్. ఉషా రాణి మరియు రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. విద్యా మరియు పరిశ్రమల మధ్య అనుసంధానం పెంపొందించడమే ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించగా, యాజమాన్యం, ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థుల మధ్య ఇంటరాక్టివ్ సమావేశం జరిగింది. ట్రైఇంపాక్ట్ సెంటర్ దార్శనికత, లక్ష్యాలను వివరించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ పరిశోధనాధారిత విద్యకు ప్రాధాన్యం పెరుగుతోందని, ఇలాంటి కేంద్రాలు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడతాయని అన్నారు. ఇతర అతిథులు కూడా కేంద్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా. మీరారాణి, ప్రొఫెసర్ ఎల్. పద్మ పర్యవేక్షణలో, వైస్ ప్రిన్సిపాల్ మోహన్ బాబు, అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో విజయవంతంగా జరిగింది.



# ప్రజావాణి అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోండి

- **కలెక్టరు మను చౌదరి ఆదేశం**

**మేడ్చల్ – మల్కాజిగిరి, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరు మను చౌదరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 163 దరఖాస్తులను కలెక్టరు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ చంద్రావతిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ, హౌజింగ్ శాఖకు అధిక సంఖ్యలో 58 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో వ్యయప్రయాసలతో అధికారులను ఆశ్రయిస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి అధికారికి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని, ఎటువంటి జాప్యం లేకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తిరస్కరించే దరఖాస్తుల విషయంలో కారణాలను స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు.అదేవిధంగా, దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బీసీలకు అన్యాయం చేసిన బడ్జెట్‌పై టిఆర్పి నిరసనలు

**వనపర్తి,మార్చి23(తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలకు నమ్మకద్రోహం చేశారంటూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి) నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా టిఆర్పి ఆధ్వర్యంలో నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా టిఆర్పి యూత్ జిల్లా అధ్యక్షుడు జి. రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం బీసీలను మోసం చేసిందన్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి రెండున్నరేళ్లు గడిచినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ప్రస్తుత బడ్జెట్ బీసీల సంక్షేమం కోసం కాకుండా కేవలం అంకెల గారడిగా రూపొందించబడిందని, బీసీలకు సరైన నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం 6 శాతం నిధులు మాత్రమే కేటాయించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు.బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి చట్టబద్ధత కల్పించాలని, 42 శాతం రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్షరం కదిలించింది.. పొంగులేటి స్పందించారు!

- **పత్రికా కథనానికి మంత్రి మెరుపు స్పందన..**
- **దివ్యాంగ బాలుడి కుటుంబానికి 'డబుల్ బెడ్ రూమ్' ఇల్లు మంజూరు**
- **గంటల వ్యవధిలోనే పట్టా అందజేత..**

**ఖమ్మం బ్యూరో, మార్చి 23(తెలంగాణ ముచ్చట్లు)**

నిజమైన ప్రజా నాయకుడు అంటే ప్రజల కష్టాలను చూసి కరగడమే కాదు.. ఆ కష్టాన్ని తీర్చడంలో మెరుపు వేగం ప్రదర్శించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరోసారి నిరూపించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలానికి చెందిన ఓ నిరుపేద దివ్యాంగ బాలుడి కుటుంబం అద్దె ఇల్లు దొరకక పడుతున్న నరకయాతనపై ఓ పత్రికలో ప్రచురితమైన కథనం మంత్రిని తీవ్రంగా కలచివేసింది. వార్త చూసిన నిమిషాల వ్యవధిలోనే ఆయన యంత్రాంగాన్ని పరుగులు తీయించి, ఆ కుటుంబానికి 'అభయహస్తం' అందించారు.



అజయ్ దీనస్థితిపై చలించిన 'ప్రజాపక్షపాతి'.

మెదడు ఎదుగుదల లేక 18 ఏళ్లుగా మంచానికే పరిమితమైన కుమారుడు అజయ్‌ను సాకుతున్న రాయల రమేష్, సులోచన దంపతుల దీనస్థితిని వార్త కథనం ద్వారా తెలుసుకున్న మంత్రి పొంగులేటి... నిబంధనల సాకులు చెప్పి ఆ తల్లిదండ్రుల కన్నీటిని నిర్లక్ష్యం చేయొద్దు.. మానవత్వంతో ఆలోచించి వారికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయండని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

**మెరుపు వేగంతో 'పట్టా' మంజూరు..**

సాధారణంగా ప్రభుత్వ ఫైళ్లు కదిలేందుకు పట్టే కాలాన్ని పక్కనపెట్టి, మంత్రి పొంగులేటి తనదైన శైలిలో 'మెరుపు వేగంతో' నిర్ణయం తీసుకున్నారు. మంత్రి స్వయంగా పర్యవేక్షించడంతో రెవెన్యూ అధికారులు యుద్ధప్రాతిపదికన కదిలారు. మంత్రి ఆదేశించిన కొద్ది గంటల్లోనే అన్ని రకాల విచారణలు పూర్తి చేసి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేస్తూ పట్టాను సిద్ధం చేశారు. స్థానిక అధికారులు స్వయంగా అజయ్ దంపతుల చేతికి మంజూరు పత్రాన్ని (పట్టా) అందజేశారు.

**ఏళ్ల వ్యధకు ముగింపు..**

"లోకం మమ్మల్ని చూసి తలుపులు మూసుకున్నా, మా పొంగులేటి అన్న మా కోసం ఇంటి తలుపులు తెరిచారు" అని అజయ్ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఏళ్ల తరబడి అందని గూడు, మంత్రి పొంగులేటి చేసిన ఒక్క ఫోన్ కాల్‌తో గంటల వ్యవధిలోనే సాకారం కావడం గమనార్హం. సమస్య ఏదైనా, అది తన దృష్టికి వస్తే పరిష్కారం అయ్యే వరకు నిద్రపోని మంత్రి పొంగులేటి 'ప్రజాపక్షపాత' వైఖరిపై జిల్లా వ్యాప్తంగా సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణలో నవోదయ విద్యాలయాల విస్తరణ పరిస్థితి ఏంటి..?

- పెద్దపల్లి, మంచిర్యాలపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు)**



దేశంలోని ప్రతి జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని కేంద్రం ప్రకటించినప్పటికీ, తెలంగాణలో ఆ లక్ష్యం ఇంకా పూర్తిగా అమలు కాలేదని, కొత్త జిల్లాల్లో నవోదయాల ఏర్పాటు ఎందుకు జరగడం లేదని, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ప్రతిపాదనలు ఉన్నాయా? ఉంటే అవి ఏ దశలో ఉన్నాయో వివరించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో సోమవారం ప్రశ్నించారు.
దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి సమాధానం ఇస్తూ దేశవ్యాప్తంగా నవోదయాల ప్రస్తుత పరిస్థితిని వివరించారు.

**తెలంగాణలో పరిమిత విస్తరణ**

దేశంలో 689 జవహర్ విద్యాలయాలు ఉండగా..తెలంగాణలో మాత్రం ఈ పథకం విస్తరణ పూర్తి కాలేదు. రాష్ట్రంలో 16 నవోదయ విద్యాలయాలు మాత్రమే మంజూరై, వాటిలో 15 ప్రస్తుతం పని చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, ఖమ్మం, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, సిద్దిపేట తదితర జిల్లాల్లో ఇవి కొనసాగుతున్నాయి. అయినప్పటికీ మరికొన్ని జిల్లాలు ఇంకా ఈ అవకాశానికి దూరంగా ఉన్నాయి.

**కొత్త నవోదయాల మంజూరుపై కేంద్ర మంత్రి స్పష్టత ఇస్తూ..**

రాష్ట్ర ప్రభుత్వాలు భూమి ఉచితంగా కేటాయించడం, తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేయడం, మౌలిక వసతులు కల్పించడం వంటి షరతులు నెరవేరితేనే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రతిపాదనలు కూడా ఈ ప్రమాణాలపై నే ఆధారపడి ఉన్నాయని వివరించారు.

# జర్నలిస్టులు.. చలో హైదరాబాద్

- ప్రభుత్వ వివక్షకు నిరసనగా... 25 న జర్నలిస్టుల
- జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య పిలుపునిచ్చారు

**ఖమ్మం బ్యూరో, మార్చి -23 (తెలంగాణ ముచ్చట్లు)**



ప్రభుత్వ వివక్షకు నిరసనగా... 25 వ తేదీన జర్నలిస్టుల 'చలో హైదరాబాద్'; పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జర్నలిస్టులకు పిలుపు: మామిడి సోమయ్య, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడుఈ నెల 25 వ తేదీన ఉదయం 11:00 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా 'చలో హైదరాబాద్——ఐ&పీఆర్ ఆఫీస్' నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యం, వివక్షాపూరిత వైఖరికి నిరసనగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లలో పాత్రికేయ వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల చూపుతున్న తీవ్ర వివక్షకు ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ స్పష్టమైన సాక్ష్యమని ఆయన నొక్కి చెప్పారు. బడ్జెట్‌లో పాత్రికేయుల సంక్షేమం గురించి, వారి శ్రేయస్సు గురించి ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం దిగ్భ్రాంతికరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, పాత్రికేయులకు కనీస కొత్త అక్రిడిటేషన్ కార్డులు లేదా ఆరోగ్య కార్డులు కూడా జారీ చేయడంలో విఫలమైందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పాత్రికేయులకు గృహ స్థలాల కేటాయింపుపై అసలు చర్చ జరగడం లేదని, సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి ఈ స్థలాలను అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పించుకుంటోందని ఆయన ఆరోపించారు. మీడియా అకాడమీకి ఇంకా పాలక మండలిని ఏర్పాటు చేయకపోవడాన్ని ఆయన విమర్శించారు. అనేక ఇతర రాష్ట్రాల్లో పదవీ విరమణ చేసిన పాత్రికేయులు పింఛన్లు పొందుతుండగా అది చూసి కూడా మన పాలకులు మన రాష్ట్రంలో ఉన్న విలేకరులపై చవితి తల్లి ప్రేమ కురిపిస్తున్నారు




# శ్రీరాం నగర్ 2బిహెచ్‌కేలో సమస్యల పరిష్కారం కోరుతూ వినతి

- ప్రజావాణిలో కలెక్టర్‌కు లబ్ధిదారుల ఫిర్యాదు

**కాప్రా, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా సర్కిల్ పరిధిలోని శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లబ్ధిదారులు కోరారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కాలనీలో వాణిజ్య సముదాయాలను వేలం వేయడాన్ని వ్యతిరేకించారు. వాటిని అద్దెకు ఇస్తే వచ్చే ఆదాయంతో కాలనీ నిర్వహణకు ఉపయోగపడుతుందని సూచించారు. కాలనీలో తాగునీటి లీకేజీలు, లిఫ్ట్‌లు పనిచేయకపోవడం, భవనాల స్లాబులు దెబ్బతినడం వంటి సమస్యలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.
జీరో విద్యుత్ బిల్లు అమలు చేయాలని, బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని, 117 నంబర్ బస్సు సర్వీసును కాలనీ వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. అలాగే కాలనీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద భద్రతా గ్రిల్స్ ఏర్పాటు, వీధి దీపాల కేబులింగ్ పనులు చేపట్టాలని కోరారు. సెల్లార్‌లో నీటి నిల్వ సమస్యను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల వినతిపై స్పందించిన కలెక్టర్ మను చౌదరి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి...

- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**ఖమ్మం బ్యూరో, మార్చి -23(తెలంగాణ ముచ్చట్లు)**





ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.
కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు.
సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన నడ్డి చందు తనకు లంగ్ క్యాన్సర్ వచ్చిందని, వైద్య చికిత్స నిమిత్తం సిఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.
కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామానికి చెందిన డి. చిన్న వెంకయ్య సర్వే నెంబర్ 175/ఘ లో వారసత్వ భూమి 17 ఎకరాల 30 గుంటల భూమి ఉందని, అందులో 7 ఎకరాల 3 గుంటల భూమి కొందరు ఆక్రమించుకున్నారని, దీనిని విచారించి, వారసత్వ హక్కులను పరిశీలించి తమ భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తగుచర్యలు తీసుకోవాలని కామేపల్లి తహసీల్దార్ ను ఆదేశించారు.
తిరుమలాయపాలెం మండలం గోపయిగూడెం గ్రామానికి చెందిన షేక్ పెంటు సాహెబ్ తనకు వికలాంగుల ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు.
ఖమ్మం నగరానికి చెందిన సామాజిక కార్యకర్త కే. వెంకన్న కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వీటిని తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు.
ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్బా..? ప్రయివేటు క్లబ్బా..?

- అక్రమ వసూళ్లు – లెక్కలపై అనుమానాలు
- తాళాలు కొద్దిమందికే.. ఇతర జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరణ
- కలెక్టర్ తక్షణ విచారణ చేయాలి
- టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్-2843) డిమాండ్

**ఖమ్మం బ్యూరో, మార్చి 23(తెలంగాణ ముచ్చట్లు)**



ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న వ్యవహారాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. జర్నలిస్టుల ఉమ్మడి వేదికగా ఉండాల్సిన ప్రెస్ క్లబ్‌ను కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకుని 'ప్రైవేట్ క్లబ్'లా నడుపుతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్2843) జిల్లా కమిటీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణలు లోకల్ బాడీస్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సభ్యత్వాల పేరుతో రూ.1000 నుంచి రూ.3000 వరకు ఎటువంటి నిబంధనలు, రశీదులు లేకుండా అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని నేతలు ఆరోపించారు.
ఈ నిధులపై ఎటువంటి లెక్కలు, ఖాతాలు వెల్లడించకపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. ఇప్పటివరకు క్లబ్ నిధులపై ఆడిట్ నిర్వహించలేదని, లెక్కలు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ప్రెస్ క్లబ్ తాళాలు కూడా కొద్దిమంది వ్యక్తుల వద్దే ఉండటం, ఇతర జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరించడం, వాట్సాప్ గ్రూపుల్లో ఇతర యూనియన్ ప్రతినిధులకు అడ్మిన్ హక్కులు ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని టిడబ్ల్యూజెఎఫ్ నేతలు తెలిపారు. ఇటీవలి కాలంలో జర్నలిస్టులను అడ్డుకోవడం, బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రెస్ స్వేచ్ఛపై నేరుగా దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకుని ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమ వసూళ్లపై ఆడిట్ నిర్వహించి లెక్కలు బహిర్గతం చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ సమాన హక్కులు కల్పించాలని టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్2843) నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, నగర అధ్యక్షులు గెంటేల కుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, నాగకృష్ణ, శ్రీధర్, వెలిగొండ వెంకట్, రవి, మొగిలి నాగేశ్వర రావు, ఎం.ఎస్. చిన్ని, మామిడాల వీరబాబు, తానంగి భిక్షం, పాగ యోనా, తిరుపతి కొండలరావు, పి.శ్రీను, సవల బాలరాజు, నీరుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పది

- జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాదిక్ అహ్మద్

**ఖమ్మం బ్యూరో, మార్చి 23(తెలంగాణ ముచ్చట్లు)**




ఈద్ మిలాప్ కార్యక్రమము వలన సమాజంలో ప్రజల మధ్య ఐకమత్యం, మతసామరస్యం, సోదరబావము పెంపొందుతాయి. భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవని ఈ విషయంలో భారతదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాదిక్ అహ్మద్ అన్నారు. ఖమ్మం షాదీ ఖానాలో జమాఅతె ఇస్లామి హింద్ నగర అధ్యక్షులు జైనుల్ పాషా అధ్యక్షతన జరిగిన జరిగిన ఈద్ మిలాప్ (పండగ కలయక) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈద్ మిలాప్ కార్యక్రమం చాలా గొప్పదని దీని ద్వారా సమాజంలో ప్రజల మధ్య ఐకమత్యం, మతసామరష్యం, సోదరబావము పెంపొందుతాయన్నారు అందుకే భారతదేశము అనేక మతాల సాంప్రదాయాల నిలయమని భిన్నత్వంలో ఏకత్వం అని దీని ప్రత్యేకత అని దీని అందరూ కాపాడుకోవాలని అన్నారు .మనందరి సృష్టి కర్త అయిన దేవుడు ఒక్కడే. మనమంతా ఒక్కటేనని, కులమతాలకు అతీతంగా ఒకరి సుఖదుఃఖాలను మరోకరు పంచుకుంటూ కలిసి మెలిసి జీవించినప్పుడే సమాజం లో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయని అన్నారు. దివ్య ఖుర్ఆన్ బోధనలు మానవాళికి ఇహంలోనూ, పరంలోనూ దారిచూపుతాయని, మంచి, చెడుల విచక్షణ చూపే ఈ గ్రంథం రమజాన్ నెలలో అవతరించిందని అందుకుగాను రమజాన్ నెలకు ప్రాముఖ్యం లభించిందని అన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, కులమతాల హెచ్చుతగ్గులు లేవని, ఉన్నదాంతో తృప్తి పడుతూ, మంచివారిగా జీవించాలి రంజాన్ ఉపవాసాలు శిక్షణ ఇస్తాయని అన్నారు. ఒకరి పండుగలు పర్వదినాలు మరోకరు పంచుకుంటే ప్రేమానురాగాలు ఆప్యాయత అనుబంధాలు పెరుగుతాయని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్ మాట్లాడుతూ భారతదేశం సర్వ మతాలకు ఒక వేదిక హిందూ ముస్లిం క్రిస్టియన్ , సిక్కు, జైన్ అన్ని మతాలవారు కూడా ఒకరి మతాలను గౌరవిస్తూ ఒకరి అభిప్రాయాలను ఒకరి గౌరవిస్తూనే అంతిమంగా మానవాళి శ్రేయస్సు మానవ ధర్మమే లక్ష్యంతోనే అందరు ముందుకు సాగాలి అన్నారు. ఈ కార్యాక్రమములో జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ఇలియాస్ సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్,సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్,ఐట రీజనల్ సెక్రెటరీ మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, జిల్లా మీడియా సెక్రెటరీ అబ్దుల్ మలిక్, యం పి జె జిల్లా అధ్యక్షులు ఖాసిం, లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బద్రి నాయక్, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ మతిన్ జమాఅతె ఇస్లామి హింద్ సభ్యులు జమీల్ అహ్మద్ ఖాన్, అబ్దుల్ సమి, ఫయాజ్ ,అబ్దుల్ రజాక్ , లతీఫ్, ఇలియాస్, గౌస్,మొయినుద్దీన్, ఇబ్రహీం షరీఫ్, హిమాదుద్దీన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్,సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, నార్త్ అధ్యక్షురాలు హుస్నేన్ బి ,సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా , జిల్లా మహిళా పబ్లిక్ రిలేషన్ కన్వీనర్ హాజీరా సదప్ సభ్యులు నస్రీన్ , సుమయ్య , షాకిరా ,రఫిఖా , ఫాతిమా , నసిమా, ఆరిఫా, జహెరా ,గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణ అధ్యక్షురాలు అమీన్ మరియు పట్టణ పలువురు ముస్లిం మరియు ముస్లిమేతర సోదరి, సోదరులు పాల్గొన్నారు.

# విట్ట శ్రీనివాస్ రెడ్డి దశదినకర్మ - నివాళులర్పించిన నిరంజన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి

**పెద్దమందడి,మార్చి23(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో అధ్యక్షులు విట్ట శ్రీనివాస్ రెడ్డి దశదినకర్మ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరై నివాళులు అర్పించారు.విట్ట శ్రీనివాస్ రెడ్డి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 8వ రోజుకు ఇండ్ల స్థలాల పోరాటం

- ప్రధాన సమస్యను పట్టించుకోని యూనియన్ నాయకులు
- యూనియన్ల కతీతంగా జర్నలిస్టులు పోరాటానికి సిద్ధం కావాలి

ఖమ్మం బ్యూరో, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు)

జిల్లా మంత్రులు జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం ఇచ్చిన 23.02 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలుగా అప్పగించాలని ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సీనియర్ జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబు రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కొరకొప్పుల రాంబాబు మాట్లాడుతూ... జర్నలిస్టులందరూ తమ కుటుంబ సభ్యులుగా భావించే జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వాలు ఇచ్చిన హామీని అమలు చేసుకునేందుకు ముందుకు రాకపోగా అందరి ఇళ్ల స్థలాల కై పోరాటం చేస్తున్న వారికి మద్దతు తెలపకపోవడం చాలా బాధాకరమన్నారు. పోరాటం చేయకుండా ఇళ్ల స్థలాలు రావని గత రెండున్నర దశాబ్దాల కాలంగా అర్హులైన జర్నలిస్టులందరికీ తెలిసిన విషయమే. యూనియన్లు ఆయా సంఘాల కార్యక్రమాలకు, సభలు సమావేశాలకు జర్నలిస్టులను వాడుకోవడమే కానీ వారి ప్రధాన సమస్య ఇండ్ల స్థలాల సమస్యను తీర్చేందుకు ముందుకు రావడం లేదని విమర్శించారు. సమాజంలో ప్రతి సమస్య పరిష్కారం కావాలంటే పోరాటం చేయక తప్పదం లేదని, అదే తరహాలో నేడు ఆశా కార్యకర్తల జీతాలను పెంచేందుకు ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేయాలని ఖమ్మం మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించడం జర్నలిస్టులకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. నాయకుల మాటలు నమ్మి ఇప్పటికే రెండున్నర దశాబ్దాల కాలం మోసపోయావని ప్రతి జర్నలిస్టు గమనించాలన్నారు. సమాజంలో ప్రజలందరి సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాల అమలు కోసం, జీతభత్యాలు లేకపోయినప్పటికీ, కాల పరిమితి లేకుండా రాత్రింబగళ్లు కష్టపడి జర్నలిస్టులు పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను మోసం చేసే ప్రభుత్వాలు భవిష్యత్తులో మనుగడను కొనసాగించలేవని పేర్కొన్నారు. భార్యా, పిల్లలు, కుటుంబ నేపథ్యాన్ని వదిలి గత ఎనిమిది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ యూనియన్లు, నాయకులు గుర్తించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. మార్చి 31 అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే పోరాటాన్ని రిలే నిరాహారదీక్ష గా కొనసాగిస్తానని, కొన్ని సందర్భాల్లో జర్నలిస్టులు స్వతంత్రంగా ఆలోచించి తమ సమస్యగా పరిష్కారానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.






## నాచారం మాదిగ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు

- కమిటీ హర్షం – సీఎం, కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌కు కృతజ్ఞతలు

నాచారం, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం గ్రామంలో గత 70 సంవత్సరాలుగా కొనసాగుతున్న మాదిగ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1.72 లక్షల నిధులు మంజూరు కావడంతో కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.శ్మశానవాటికలో ఇప్పటివరకు సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో దహన సంస్కారాలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందని, వెయిటింగ్ షెడ్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా తగిన నీటి సౌకర్యం లేకపోవడం, బాత్రూములు పాడై కూలిపోతున్న పరిస్థితి ఉండటం వల్ల టెంట్లు వేసుకుని బయట స్నానం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. శ్మశానవాటికకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, లోపల లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి సమయంలో దహన సంస్కారాలు నిర్వహించడం కష్టంగా మారిందని తెలిపారు. దొంగల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని కూడా ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిటీ సభ్యులు మందముల పరమేశ్వర్ రెడ్డికు వినతిపత్రం సమర్పించగా, ఆయన వెంటనే స్పందించి కేవలం 15 రోజుల్లోనే నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, "మా సమస్యలను వెంటనే గుర్తించి స్పందించిన మందముల పరమేశ్వర్ రెడ్డి కి, అలాగే అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏర్పుల నర్సింగరావు, గౌడెల్లి శ్రీనివాస్, ఏర్పుల నాగరాజు, నూతలనకంటి రాజు, ఏర్పుల నరేందర్, అయ్యగారి రమేష్, ఏర్పుల చిన్న, రవి, ఇస్తారి పవన్ తదితరులు పాల్గొన్నారు.





# చర్చి కాలనీలో డ్రైనేజీ పనులు నిలిచిపోవడం పై ఆగ్రహం

- కాంట్రాక్టర్‌పై చర్యలకు ఆదేశాలు
- మందుముల పరమేశ్వర్ రెడ్డి,

ఉప్పల్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ డివిజన్‌లోని చర్చి కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయినట్లు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.సోమవారం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పనులు ఇంకా ప్రారంభం కాలేదని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన పరమేశ్వర్ రెడ్డి వెంటనే వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. పనులు చేపట్టని కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో చేర్చాలని కోరారు. దీనికి ఎండీ సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మంగళవారం వాటర్ వర్క్స్ అధికారుల బృందం చర్చి కాలనీని సందర్శించనుంది. అధికారి పంకజ ఆధ్వర్యంలో జరిగే ఈ పర్యటనలో పరిస్థితులను సమీక్షించి డ్రైనేజీ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టనున్నారు .ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జాన్ విల్సన్, పోలిశెట్టి సుధాకర్, రత్న రెడ్డి, సతీష్, డేవిడ్, వినోద్, లుకాస్, లుది రెడ్డి, భాస్కర్, సందీప్, వినయ్, కిరణ్, రాజు, రాయన్న, మేరీ, సుమలత రెడ్డి, వినాశమ్మ, రోస్ మేరీ, పుష్పాలమ్మ, లక్ష్మ రెడ్డి, శామ్యూల్, బాలస్వామి, జై రాజ్ తదితరులు పాల్గొన్నారు.




## జనన–మరణ సర్టిఫికెట్ల జారీ, దోమల నివారణకు చర్యలు కోరుతూ వినతి

కీసర, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ డివిజన్1 పరిధిలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్ ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. సోమవారం తార్నాకలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా జనన-మరణ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో ఆలస్యం జరుగుతుందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ పాత రికార్డులను పరిశీలించి అర్హులైన వారికి తక్షణమే ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కోరారు.అలాగే డివిజన్‌లో దోమల సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఫాగింగ్ నిర్వహించి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన వినతులను అధికారులు వేగంగా పరిష్కరించాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని ఆయన సూచించారు. సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# లక్కీడ్రా విజేతలకు బహుమతుల పంపిణీ

ఖమ్మం బ్యూరో, మార్చి 23(తెలంగాణ ముచ్చట్లు)

నగరంలోని బోనకల్ రోడ్డు శ్రీరాం హిల్స్ లోని ఎస్ ఆర్ కాంప్లెక్స్ లో హైదరాబాద్‌కు చెందిన 'స్పార్క్లా జ్యువల్స్' ఆధ్వర్యంలో ఈ నెల 21,22వ తేదీల్లో నిర్వహించిన 'స్వర్ణ ఉత్సవం' ప్రదర్శన ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీడ్రా విజేతలకు సోమవారం నగదు బహుమతులను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అందజేశారు.

**వినియోగదారులకు చేరువగా వినూత్న డిజైన్లు..**

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ జ్యువెలరీ సంస్థ స్పార్క్లా వారు ఖమ్మం నగర వాసుల కోసం ప్రత్యేకంగా ఈ ప్రదర్శనను ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, సరికొత్త మోడళ్లు, ఆకర్షణీయమైన డిజైన్లతో కూడిన ఆభరణాలను అందుబాటులోకి తీసుకువచ్చారని కొనియాడారు. కేవలం వ్యాపారమే కాకుండా, లక్కీడ్రా ద్వారా వినియోగదారులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందించడం సంతోషకరమన్నారు. ఇలాంటి ప్రదర్శనలు స్థానిక ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలను ఎంచుకునేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని ఆయన వివరించారు.




లక్కీడ్రా విజేతలు వీరే..

లక్కీడ్రాలో శ్రీరాం హిల్స్‌కు చెందిన వై. కృష్ణ ప్రసాద్ ప్రథమ బహుమతిగా రూ. 25,111 నగదును అందుకోగా, ఎ. వరలక్ష్మి ద్వితీయ బహుమతిగా రూ. 15,111 నగదును గెలుచుకున్నారు.



## ముందు గ్రామ సమస్యలు పరిష్కరించండి

- బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ కౌంటర్
- సునీల్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

పెద్దమందడి,మార్చి23(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా కేంద్రం నుంచి పెద్దమందడి మండల కేంద్రానికి రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని కాంగ్రెస్ నాయకులు సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటికే విద్యుత్ స్తంభాల మార్పిడి, రోడ్డు వెడల్పు సర్వే తదితర పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ రహదారి పనులను ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మంజూరు చేయించారని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, రోడ్డు గుంతలమయంగా ఉందంటూ బీజేపీ నాయకుడు చేసిన విమర్శలకు కాంగ్రెస్ పార్టీ ఘాటుగా స్పందించింది.చీకరు చెట్టు తాండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రోడ్డు నిధులు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు.ముందుగా గ్రామంలో ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, దోమల బెడదపై చర్యలు తీసుకోవాలని సూచించారు.మూడు నెలలుగా దోమల మందు పిచికారీ చేయలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామ సమస్యలను పక్కనపెట్టి మండల కేంద్రంపై విమర్శలు చేయడం తగదని అన్నారు. అదేవిధంగా ఎల్పీజీ సిలిండర్ ధరలు పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముందుగా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని బీజేపీ నాయకులకు సూచించారు.

# అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):





అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.26,000 వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ మరియు పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షురాలు జి. సునీత అధ్యక్షత వహించగా, కార్యదర్శి బి. శోభారాణి పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్, డి.డబ్ల్యూ.ఓ.లకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను కార్మికులుగా గుర్తించి తగిన వేతనాలు చెల్లించాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో రూ.18,000 వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయలేదని విమర్శించారు.ప్రస్తుతం ఆన్లైన్ విధానాల కారణంగా రోజుకు 16-18 గంటలపాటు పనిచేయాల్సి వస్తోందని, ఫోన్, రీచార్జ్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల అద్దెలు నెలల తరబడి చెల్లించకపోవడం వల్ల కేంద్రాల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. కొత్త విద్యా విధానం పేరుతో ఐసిడిఎస్ వ్యవస్థను బలహీనపరుస్తున్నారని ఆరోపిస్తూ, 2026 ఎడ్యుకేషన్ పాలసీని సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే 'పీఎం శ్రీ' విద్యను అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని, అందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు.ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, ఇన్‌చార్జ్ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శివరాణి, నాయకులు శ్రీలత, రాణి, షైన్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. అశోక్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# భూదాన్ భూముల కేసులో మరో నలుగురు కీలక నిందుతులు అరెస్ట్

- టౌన్ ఏసీపీ

ఖమ్మం బ్యూరో, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం అర్బన్ పరిధిలోని వెలుగుమట్ల రెవెన్యూ ప్రాంతంలోని భూదాన్, ప్రభుత్వ భూములపై అక్రమ వ్యాపారాలకు, ఆక్రమణలకు పాల్పడిన వారి పై సీర్. నో. 101/2026, యూ/ఎస్ 111 (1) (ii), 318(4) ర్/వ 3(5) అఫ్ బి న్ ఎస్ 2023 క్రింద గతంలో ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన కేసులో మరో నలుగురు కీలక నిందుతులైన 1.కల్తీ రామచంద్రయ్య 2. బాణాల లక్ష్మణ చారి 3. చిప్పనపల్లి వీరయ్య 4. కుంజా కృష్ణయ్య ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఆయా కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అదేవిదంగా ఈ కేసు లో ప్రధాన నిందుతులైన 1) పోలెబోయిన ముత్తయ్య, 2)బల్లి శ్రీనివాస్, 3)కొప్పెర వెంకన్న, 4)కొట్టే బసు,5) సంపంగి వెంకటాచలం, లను మెజిస్ట్రేట్ అనుమతి తో పోలీస్ కస్టడీపై తీసుకొచ్చి విచారించిన అనంతరం సోమవారం తిరిగి జ్యుడీషియల్ రిమాండుకు తరలించడం జరిగిందని అన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు పదహారు (16) మంది నిందుతులను అరెస్ట్ చేయడం జరిగిందని, నిందుతుల అక్రమ అస్తులను గుర్తించి వాటిని చట్ట ప్రకారంగా స్వాధీనం పర్చుకొనుటకు ప్రక్రియ కొనసాగుతుందని ఏసీపీ తెలిపారు.



# అసెంబ్లీ ముట్టడిలో భాగంగా అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- బీజేపీ మండల అధ్యక్షుడు కనికే శివకుమార్

రాజోలి,మార్చి23(తెలంగాణ ముచ్చట్లు):

రాజోలి మండలంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న సమయంలో ముందస్తు అరెస్టులు జరపడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ మండల అధ్యక్షుడు కనికే శివకుమార్ తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఇప్పటి వరకు ప్రజలకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కదాన్నికూడా పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. అవినీతి, అరాచక పాలన కొనసాగుతోందని ఆరోపిస్తూ, ఈ పరిస్థితులను నిలదీయడానికే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడడం దురదృష్టకరమని, ఈ విధమైన చర్యలతో ఉద్యమాలను అణిచివేయలేరని ఆయన స్పష్టం చేశారు. ప్రజల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, ఉపాధ్యక్షుడు కొంకటి రాము, కోశాధికారి రాజేష్, సీనియర్ నాయకులు ఈసీ ఆంజనేయులు, గట్టు రాము తదితరులు పాల్గొన్నారు.

# గృహ డెమోస్టిక్ సిలిండర్లను వాణిజ్యానికి వాడితే కఠిన చర్యలు

- జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్

వనపర్తి,మార్చి23(తెలంగాణ ముచ్చట్లు):



గృహ వినియోగానికి ఉద్దేశించిన ఎల్పిజి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్టవిరుద్ధమని జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి పట్టణంలోని పలు హోటళ్లలో జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్ తన బృందంతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోటళ్లలో గృహ వినియోగానికి సంబంధించిన ఎల్పిజి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీలలో భాగంగా మొత్తం 19 గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యజమానులు తప్పనిసరిగా కమర్షియల్ సిలిండర్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుబడి ఉన్నారని తెలిపారు.

# వర్షా కాల సమస్యల నివారణకు బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభం

- రూ.60 లక్షలతో 300 మీటర్ల నిర్మాణం
- పనుల నాణ్యతపై రాజీ ఉండదని బొంతు శ్రీదేవి యాదవ్ స్పష్టం

కుషాయిగూడ, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడలో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.పోచమ్మ ఆలయం నుంచి పైబస్తి వరకు సుమారు 300 మీటర్ల మేర రూ.60 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు.ఈ పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పనులను వేగవంతంగా పూర్తి చేసి వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండదని అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. గత సంవత్సరం స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ పనులకు అనుమతి లభించినప్పటికీ, కొన్ని కారణాలతో ఆలస్యమైంది. అనంతరం సంబంధిత అధికారులకు వినతి పత్రం అందించడంతో పనులు తిరిగి ప్రారంభమైనట్లు ఆమె వివరించారు. స్థానిక ప్రజలు, నాయకులు బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభించినందుకు బొంతు శ్రీదేవి యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# నాగిలిగొండలో ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి

- విప్లవ వీరుడికి నివాళులర్పించిన సిపిఐ నేతలు

ఖమ్మం బ్యూరో, మార్చి 23(తెలంగాణ ముచ్చట్లు)

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన మహా విప్లవకారుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో ఘనంగా నివాళులర్పించారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జితేందర్ రెడ్డి మరియు గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ అమర్ రహే అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, యువత భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని, దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. పాల్గొన్న ప్రముఖులు: ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏపూరి పద్మ, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు



యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులంతా ఏకమై భగత్ సింగ్ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన చూపిన బాటలో నడవాలని సంకల్పించారు.

# పార్టీలో అవమానాలు భరించలేకపోతున్నా..

- 30వ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్త చట్టు మంగ ఆవేదన
- మీడియా సాక్షిగా తన గోడు వెళ్లబోసుకున్న బాధితురాలు

ఖమ్మం బ్యూరో, మార్చి 23(తెలంగాణ ముచ్చట్లు)

పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న తనను ఒక మహిళనని చూడకుండా కించపరుస్తున్నారని, రాజకీయాలెందుకంటూ అవమానకరంగా మాట్లాడుతున్నారని 30వ డివిజన్ మహిళా కాంగ్రెస్ కార్యకర్త చట్టు మంగ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె తనపై జరుగుతున్న వేధింపులను వివరించారు.



ఈ నెల 21వ తేదీన డివిజన్ పరిధిలో బూత్ లెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఆ సమయంలో పార్టీకి చెందిన బొమ్మ ఉదయ్ అనే వ్యక్తి తనను ఉద్దేశించి "నీకు రాజకీయాలతో పనేంటి? ఇంట్లో ఉండి పిల్లల్ని చూసుకోవాలి కదా" అంటూ అసభ్యంగా మాట్లాడారని ఆమె ఆరోపించారు. గతంలోనూ నాలుగైదు సార్లు ఇలాగే కించపరిచారని, ఈ విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లినా సదరు వ్యక్తి తీరులో మార్పు రాలేదని పేర్కొన్నారు.."నేను నిన్నగాక మొన్న రాజకీయాల్లోకి రాలేదు. 1997 నుంచి గాంధీనగర్ ప్రాంతంలో పార్టీ బలోపేతం కోసం ఒక కార్యకర్తగా బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాను. తుమ్మల నాగేశ్వరరావు , పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నా పనితీరు తెలుసు. ఎప్పుడూ పదవుల కోసం ఆరాటపడలేదు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుంటే, క్షేత్రస్థాయిలో ఇలాంటి అణచివేత చర్యలు బాధాకరం" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్యకర్తలకు గౌరవం దక్కాలని, తనను దూషించిన వ్యక్తిపై పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# పోలీసుల ముందస్తు చర్యలపై ప్రతిపక్షాల విమర్శల వెల్లువ

జమ్మికుంట టౌన్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):

అసెంబ్లీ సమావేశాలను ముట్టడించేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను జమ్మికుంట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ఘటనపై ప్రతిపక్షాలు మండిపడుతూ పోలీసుల ముందస్తు చర్యలను తీవ్రంగా ఖండించాయి.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోరుతూ ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన తెలపాలని ప్రయత్నించిన నేతలను అడ్డుకోవడం సరైన విధానం కాదని ప్రతిపక్ష నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు వెళ్తున్న వారిని అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇక పోలీసులు మాత్రం శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ముందస్తు చర్యలు



తీసుకున్నామని వివరణ ఇచ్చారు. అయితే, ప్రభుత్వం విమర్శలను తప్పించుకునేందుకు నిరసనలను అణచివేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం నిరసనలను అడ్డుకోవడంపైనే దృష్టి పెట్టిందని విమర్శించాయి. బీజేపీ నాయకులు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, “హామీలు అమలు చేయలేని ప్రభుత్వం ప్రశ్నలను తట్టుకోలేక అరెస్టుల దారిని ఎంచుకుంది” అని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకోవడాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి ముప్పని పేర్కొన్నారు. మొత్తానికి, ఈ ఘటన ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా స్వరాలకు ఎంత స్థానం ఉందన్న ప్రశ్నను మరోసారి ముందుకు తెచ్చింది.

# గ్రామం నుంచి రాష్ట్ర స్థాయికి సతీష్ విజయగాథ

ఎల్కతుర్తి, మార్చి 23: (తెలంగాణ ముచ్చట్లు)

సామాన్య గ్రామ యువకుడిగా ప్రారంభమైన ప్రయాణం రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందే స్థాయికి చేరిన గుండేటి సతీష్ విజయగాథ ప్రేరణగా నిలుస్తోంది. ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన సతీష్‌కు హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మశాలి టెక్స్టైల్స్ అండ్ లైఫ్ స్టైల్ ఎక్స్‌పో వేదికగా ప్రతిష్ఠాత్మకమైన పద్మశాలి ఉగాది సేవా పురస్కారం లభించింది. సమాజ సేవలో ఆయన చూపిన అంకితభావం, చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేసిన కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, ప్రముఖ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా సతీష్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

ఈ వేడుకలో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్, సభ అధ్యక్షులు డాక్టర్ మార్త రమేష్ తదితరులు పాల్గొన్నారు. కుల బాంధవుల సమక్షంలో ఘనంగా పురస్కార ప్రదానం జరిగింది.

గుండేటి సతీష్ గత కొంతకాలంగా పేదలకు సహాయం, యువతకు మార్గనిర్దేశం, చేనేత రంగ అభివృద్ధికి కృషి చేస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన సేవలను అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలో ఈ అవార్డును అందజేయడం గర్వకారణంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింతగా సమాజ సేవలో పాల్గొంటానని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన కుటుంబ సభ్యులు, మిత్రులు, పద్మశాలి సమాజ పెద్దలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సతీష్‌ను అభినందిస్తూ, ఆయన సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# పేద పిల్లల ఆకలిని అవమానించిన బాధ్యతారహిత్యం!

ఊహించండి... ఒక చిన్న గ్రామంలో, ఇంట్లో రాత్రంతా ఆకలితో మలచుకున్న ఒక చిన్నారి. తల్లి కళ్లలో నీళ్లు, తండ్రి మౌనం - ఏమీ చేయలేక. ఉదయం ఆ బాలుడు బడికి బయలుదేరాడు, కడుపులో ఆకలి మంటతో. బడిలో మధ్యాహ్న భోజనం - ఒక ప్లేట్ అన్నం, ఒక గుడ్డు - ఆ క్షణంలో అతని కళ్లలో ఆశ మళ్లీ మండింది. ఆ ఒక్క భోజనం అతన్ని చదువుకునేలా చేసింది, ఆకలి మరచిపోయేలా చేసింది, భవిష్యత్తుకు ఒక చిన్న దారి చూపింది. ఇది భిక్ష కాదు... ఇది హక్కు! ఇది ప్రేమ! ఇది ఆశ!

కానీ గరికపాటి నరసింహారావు ఏమన్నారు? "శోభనం పెళ్లి కొడుకులా మంచమెక్కి కూర్చుంటాడు!" అని... ఆకలితో బడికి వచ్చే ఆ చిన్న పిల్లవాడిని, ఆ బాలికను, ఆ పేద కుటుంబ బిడ్డను ఇలా హేళన చేశారు! గుడ్డు పెట్టడం "సెన్స్‌లెస్" అన్నారు... ఆ గుడ్డు ఒక్కటి ఆ పిల్లవాడి రక్తంలో ఇనుము పెంచి, అనీమియా తగ్గించి, మెదడును బలపరిచే విషయం మరచిపోయారు! "భోజనం కోసమే వస్తున్నారు... ఇన్ని ఇస్తే చదువు రాదు... ఇంటి నుంచి తెచ్చుకోండి లేదా మానేయండి!" అన్నారు... ఆ మాటలు వినగానే ఒక తల్లి గుండె రక్తక్షరణ అయింది. "నా బిడ్డ ఆకలితో బడికి వెళ్తుంది... అది భిక్ష కాదు, దాని హక్కు!" అని ఆమె ఏడుపు మాటలు ఎవరు విన్నారు? ఆ ఏడుపు మీ చెవులకు ఎందుకు చేరలేదు, గరికపాటి గారూ?

భారతదేశంలో 35% పిల్లలు స్టంటెడ్ - ఎత్తు తక్కువ, బరువు తక్కువ! 19% వేస్టెడ్ - ఆకలి వల్ల శరీరం కరిగిపోతోంది! అర్ధ భాగం పిల్లల మరణాలు మాల్‌న్యూట్రిషన్



వల్ల! ఈ భయంకర వాస్తవాల మధ్య మధ్యాహ్న భోజన పథకం ఒక రక్షణ కవచం. అధ్యయనాలు చెబుతున్నాయి - హాజరు 1625% పెరిగింది, డ్రాపౌట్ రేట్లు తగ్గాయి (ముఖ్యంగా బాలికలు, SC/ST, గిరిజన పిల్లల్లో), పోషకాహార మెరుగుదల, అనీమియా తగ్గడం... ఆకలి తీరిన పిల్లవాడు చదువుపై దృష్టి పెట్టగలడు. ఇది సైన్స్ కాదు...హృదయానికి తెలిసిన నిజం!

ఆ చిన్న గుడ్డు, ఆ ప్లేట్ అన్నం - ఎంతమంది పిల్లల జీవితాలను మార్చాయో మీకు తెలుసా?

పద్మశ్రీ అందుకున్న ఆయన, ప్రవచనాలు చెప్పే ఆయన, పేదల పక్షపాతి అని చెప్పుకునే ఆయన - ఈ మాటలు ఎందుకు? ఆ "శోభనం పెళ్లి కొడుకు" పోలిక... ఆకలితో బాధపడే ఆ జీవితాలను ఎంత హీనంగా, ఎంత నీచంగా చూశారు? ఆ మాటలు విన్న ప్రతి తల్లి గుండెల్లో మంట రగిలింది. "నా బిడ్డ భిక్షాటన చేస్తున్నాడా? లేక హక్కు కోసం పోరాడుతున్నాడా?" అని ఆమె ఏడ్చింది. ఆ ఏడుపు మీ హృదయాన్ని ఎందుకు తాకలేదు?

విద్యా నాణ్యత మెరుగుపరచాలి - అది నిజమే. ఉపాధ్యాయుల కొరత, గదుల లోపం, బోధన పద్ధతులు - ఇవన్నీ సరిచేయాలి. కానీ దానికి ఆకలిని శిక్షించడమా? భోజనాన్ని తీసేయడమా? ఆకలితో ఉన్న పిల్లవాడు ఏ గురువు మాటా వినలేడు, ఏ పుస్తకం చదవలేడు. ఆకలి ఒక శత్రువు - దాన్ని ఓడించకుండా విద్య గెలవదు!

గరికపాటి గారూ... మీ మాటలకు బరువు ఉంది. మీరు మాట్లాడితే సమాజం వింటుంది. కానీ ఆ మాటలు పేద పిల్లల కళ్లలో నీళ్లు తెప్పించాయి. ఒక తల్లి ఏడుపు మీ చెవులకు ఎందుకు చేరలేదు? ఆ చిన్నారి ఆకలి మీ హృదయాన్ని ఎందుకు తాకలేదు? పేద పిల్లల భవిష్యత్తు మనందరి బాధ్యత. వారి ఆకలిని అవమానించకండి. వారి ఆశను ఆపకండి. మధ్యాహ్న భోజనం భిక్ష కాదు - అది ప్రేమ, అది న్యాయం, అది భవిష్యత్తుకు ఒక చిన్న ఆలంబన! ఆ చిన్న పిల్లవాడి కళ్లలో ఆకలి కాదు... ఆశ ఉండాలి. ఆ ఆశను మన మాటలు ఎన్నడూ దెబ్బతీయకూడదు.

గరికపాటి గారూ... ఒక్కసారి ఆ పిల్లల కళ్లలోకి చూడండి. ఆకలి తీరిన తర్వాత వారి చూపులో ఉండే ఆనందం... అది మీ ప్రవచనాల కంటే ఎంతో పెద్ద సత్యం! ఆ ఆనందాన్ని కాపాడండి... అవమానించకండి!

**రాజేష్ బొల్లెపాక**
**-సీనియర్ జర్నలిస్ట్**



# బంగారం, వెండి ధరలు పతనం

**2హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఈ ఏడాది ప్రారంభంలో ఆకాశాన్నంటిన బంగారం, వెండి ధరలు ఇప్పుడు పడిపోతున్నాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో ఈ విలువైన లోహాల ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి.

సోమవారం ట్రేడింగ్‌లో అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 4377.95 డాలర్లకు పడిపోయి నాలుగు నెలల కనిష్ఠానికి చేరింది. వరుసగా తొమ్మిదో రోజు కూడా బంగారం ధర తగ్గడం మార్కెట్‌లో ఆందోళన కలిగిస్తోంది. గతవారం ప్రారంభంలో ఇదే ధర 5000 డాలర్లకు పైగా ఉండటం గమనార్హం. అదే సమయంలో వెండి ధర కూడా ఔన్స్‌కు 65.74 డాలర్లకు పడిపోయింది.

దేశీయ మార్కెట్‌లో కూడా ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఏప్రిల్ ఫ్యూచర్స్‌లో 10 గ్రాముల బంగారం ధర 4.59 శాతం తగ్గి రూ.1,37,862కు చేరగా, మే ఫ్యూచర్స్‌లో వెండి ధర 5.70 శాతం పడిపోయి కిలోకు రూ.2.13 లక్షల వద్ద ట్రేడవుతోంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,390గా ఉండగా, వెండి కిలో ధర రూ.2.20 లక్షలుగా నమోదైంది.

ఈ ధరల పతనానికి ప్రధాన కారణాలు అనేకం. పశ్చిమాసియా యుద్ధం కారణంగా చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణ భయాలు పెరిగాయి. అలాగే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే అవకాశాలు, డాలర్ బలపడటం కూడా బంగారం, వెండి ధరలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

ఇక ప్రధాన కేంద్ర బ్యాంకులు—ముఖ్యంగా యూఎస్ ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ జపాన్—వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడం కూడా బులియన్ మార్కెట్‌పై ఒత్తిడి పెంచుతోంది.

మొత్తానికి, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో బంగారం, వెండి ధరలు ప్రస్తుతం క్షీణత దిశగా సాగుతున్నాయి. వచ్చే రోజుల్లో పరిస్థితులు ఎలా మారుతాయన్నది గ్లోబల్ ఆర్థిక పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

# పశ్చిమాసియా పరిస్థితులపై లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రకటన

- దౌత్యం, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని వ్యాఖ్య
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధమని స్పష్టం
- చమురు, ఎరువుల సరఫరాపై ప్రభుత్వం ముందస్తు చర్యలు



**న్యూఢిల్లీ, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఈ సంక్షోభాన్ని యుద్ధంతో కాకుండా దౌత్యం, చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం భారత్ నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, వాటి ప్రభావం దీర్ఘకాలం కొనసాగవచ్చని హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాల దాడులు, హోర్ముజ్ జలసంధి మూసివేతతో అంతర్జాతీయంగా చమురు సరఫరాపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో, భారత్ పరిస్థితిని సమగ్రంగా పర్యవేక్షిస్తున్నదని ప్రధాని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను కొందరు దుర్వినియోగం చేసుకునే అవకాశం ఉన్నందున దేశంలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. దేశం మొత్తం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ ముందుగానే సిద్ధమైందని ప్రధాని తెలిపారు. గత దశాబ్దంలో ముడి చమురు నిల్వల సామర్థ్యాన్ని పెంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ వద్ద సుమారు 53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ఇవి ఆయిల్ కంపెనీల నిల్వలకు భిన్నమని తెలిపారు. అలాగే రిఫైనరీ సామర్థ్యాన్ని కూడా గత 11 సంవత్సరాల్లో పెంచుకున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంపై కూడా ఈ సంక్షోభ ప్రభావం పడే అవకాశం ఉందని, అయితే రైతులకు అవసరమైన ఎరువులను సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధాని స్పష్టం చేశారు. కోవిడ్ సమయంలో లాగా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు అన్ని విధాలుగా మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు.

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మొదలైన తర్వాత ఇప్పటివరకు 3.75 లక్షల మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్లు ప్రధాని తెలిపారు. కేవలం ఇరాన్ నుంచే 1000 మందిని రక్షించామని, వారిలో 700 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. ఈ సంక్షోభ ప్రభావాన్ని తగ్గించేందుకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక వ్యూహాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభంపై భారత పార్లమెంట్ ఒకే స్వరం వినిపించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. యుద్ధం జరుగుతున్న దేశాలతో భారత్‌కు ఉన్న వాణిజ్య సంబంధాలు దృష్ట్యా ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ విధానం ద్వారా భారత్ ఇంధన దిగుమతులను గణనీయంగా తగ్గించుకున్నదని కూడా వివరించారు.



# గిరిజనుల అంశంపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

- 'వనవాసి' పదంపై కాంగ్రెస్ ఆగ్రహం
- కుల గణన అవసరంపై స్పష్టం
- మోదీ ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆరోపణలు

**వడోదర, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో జరిగిన 'ఆదివాసీ అధికార్ సంవిధాన సమ్మేళన్'లో పాల్గొన్న ఆయన, గిరిజనులను 'వనవాసి' అని సంభోదించడం వెనుక ఉద్దేశ్యాన్ని ప్రశ్నించారు. శతాబ్దాలుగా గిరిజనులకు చెందిన నీరు, అడవులు, భూములపై వారి యాజమాన్య హక్కులను నిరాకరించడానికే ఈ పదాన్ని సృష్టించారని ఆరోపించారు. ఆదివాసీలు ఈ దేశపు అసలైన యజమానులని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'వనవాసి' అనే పదం గిరిజనులు కేవలం అడవుల్లో నివసించే వారిగా చూపిస్తుందని, అయితే 'ఆదివాసి' అనే పదం వారికి భూమిపై హక్కులను స్పష్టం చేస్తుందని అన్నారు. గిరిజన నాయకుడు బిర్సా ముండా ఆశయాలను కాపాడటంలో బీజేపీ విఫలమవుతోందని విమర్శించారు. అభివృద్ధి పేరిట గిరిజనుల భూములను సరైన పరిహారం లేకుండా తీసుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో గిరిజనులు తమ వాటాను పొందాలంటే కుల గణన కీలకమని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. కుల గణన ద్వారా ఆదివాసీల అసలు జనాభాను గుర్తించి, ప్రభుత్వ వ్యవస్థలలో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించవచ్చని తెలిపారు. దేశ జనాభాలో ఆదివాసీలు 9 శాతం, దళితులు 15 శాతం, ఓబీసీలు 50 శాతం ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఇక మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలపైనా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం వల్ల భారత రైతులు, చిన్న పరిశ్రమలు నష్టపోతాయని అన్నారు. అమెరికా ఉత్పత్తులకు మార్గం సుగమం చేస్తూ దేశీయ ఉత్పత్తులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, పశ్చిమాసియా సంక్షోభంపై ప్రధాని ప్రసంగంలో కొత్తదనం లేదని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. మిడిల్ ఈస్ట్ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు.

# రైతులకు పూర్తి రుణమాఫీ లేదు: కేంద్రం స్పష్టం

- 4పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటన
- కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా రాయితీ రుణాలు
- వైకల్య సైనికుల పింఛన్‌పై పన్ను మినహాయింపు కొనసాగింపు



**న్యూఢిల్లీ, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు పూర్తి రుణమాఫీపై ఎలాంటి ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో స్పష్టం చేశారు. అయితే రైతుల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడానికి కేంద్రం పలు కీలక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యంగా కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా రైతులకు సకాలంలో తగిన రుణం అందిస్తున్నామని పేర్కొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం కింద రూ.3 లక్షల వరకు పంట రుణాన్ని రాయితీ వడ్డీ రేట్లకు అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. సవరించిన వడ్డీ రాయితీ పథకం కింద సకాలంలో రుణం తిరిగి చెల్లించే రైతులకు అదనపు ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నామని తెలిపారు. అలాగే పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాల పరిమితిని రూ.1.60 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచినట్లు చెప్పారు. వ్యవసాయ రంగానికి తగిన రుణ ప్రవాహం ఉండేలా బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని కేంద్రం పేర్కొంది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు నేరుగా నగదు బదిలీతో పాటు పంటల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఈ చర్యల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇక సాయుధ దళాల సిబ్బందికి సంబంధించిన అంశాలపై కూడా మంత్రి సమాధానం ఇచ్చారు. వైకల్యంతో సేవల నుంచి వైదొలిగిన సైనికుల పింఛన్‌పై ఆదాయపు పన్ను మినహాయింపును కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. కొత్త ఆదాయపు పన్ను చట్టంలో కూడా ఈ మినహాయింపు కొనసాగించేలా నిబంధనలు చేర్చినట్లు వివరించారు. వైద్య పరీక్షల ఆధారంగా సైనికుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి, అవసరమైతే సేవల నుంచి తొలగించి పింఛన్ అందజేస్తామని తెలిపారు.

# గెలాక్సీ ఎస్ 26పై భారీ తగ్గింపు.. నెలాఖరు వరకే ప్రత్యేక ఆఫర్

**హైదరాబాద్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రముఖ టెక్నాలజీ సంస్థ శామ్సంగ్ గెలాక్సీ ఎస్ 26 ప్రీమియం స్మార్ట్‌ఫోన్ శామ్సంగ్ గెలాక్సీ ఎస్ 26పై వినియోగదారులకు ఆకట్టుకునే రీతిలో భారీ ధర తగ్గింపును ప్రకటించింది. ఇప్పటికే మార్కెట్లో మంచి డిమాండ్ సంపాదించుకున్న ఈ ఫోన్‌పై అకస్మాత్తుగా ధర తగ్గించడం టెక్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌తో ప్రీమియం ఫోన్ కొనాలనుకునే వారికి మంచి అవకాశం లభించింది.

ఈ స్మార్ట్‌ఫోన్ 12 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ ప్రారంభ ధర రూ.87,999గా ఉండేది. అయితే తాజా ఆఫర్‌లో భాగంగా కంపెనీ నేరుగా రూ.8,000 తగ్గించడంతో ప్రస్తుతం ఈ ఫోన్ రూ.79,999కే లభిస్తోంది. దీనికి తోడు ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై అదనపు రాయితీలు, పాత ఫోన్ ఎక్స్ఛేంజ్ ఆఫర్లు కూడా అందుబాటులో ఉండటంతో మొత్తం ధర మరింత తగ్గే అవకాశం ఉంది. అయితే ఈ ప్రత్యేక తగ్గింపు ఆన్‌లైన్‌లో కాకుండా కేవలం ఆఫ్‌లైన్ స్టోర్లలో కొనుగోలు చేసిన వారికి మాత్రమే వర్తించడం గమనార్హం.

ఈ ఆఫర్ మార్చి 21 నుంచి మార్చి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. దీంతో తక్కువ ధరలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ కొనాలనుకునే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తానికి, ధర తగ్గింపుతో గెలాక్సీ ఎస్ 26 మరింత ఆకర్షణీయమైన ఎంపికగా మారింది.



# ఖనిజ రంగంలో భారీ మార్పులు

**న్యూఢిల్లీ, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ ఖనిజ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. జాతీయ జిల్లా ఖనిజ ఫౌండేషన్ సదస్సు 2026లో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ఏడో విడత కీలక ఖనిజ బ్లాక్‌ల వేలాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విడతలో మొత్తం 19 ఖనిజ బ్లాక్‌లను వేలానికి ఉంచుతున్నట్లు తెలిపారు. దేశంలో ఖనిజ వనరుల వినియోగాన్ని సమర్థవంతంగా పెంచడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని వివరించారు. ఇప్పటివరకు నిర్వహించిన ఆరు విడతల వేలాల్లో మొత్తం 46 ఖనిజ బ్లాక్‌లు విజయవంతంగా కేటాయించబడ్డాయని మంత్రి వెల్లడించారు. ఈ ప్రక్రియ ద్వారా దేశ ఖనిజ రంగంలో పారదర్శకత పెరిగిందని, కొత్త పెట్టుబడిదారులకు అవకాశాలు విస్తరించాయని తెలిపారు. ముఖ్యంగా ఈసారి కొత్త అన్వేషణ సంస్థలు గుర్తించిన బ్లాక్‌లను కూడా వేలంలో చేర్చడం ద్వారా పోటీని మరింత పెంచుతున్నామని పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రధానమంత్రి నాయకత్వంలో ఖనిజ రంగంలో సంస్కరణలు వేగంగా జరుగుతున్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పారదర్శక విధానాలు, సాంకేతిక వినియోగం, సమర్థవంతమైన పరిపాలనతో ఈ రంగం అభివృద్ధి దిశగా పయనిస్తున్నట్లు తెలిపారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## హుజురాబాద్‌లో హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు..

### 22 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 23 (తెలంగాణ ముచ్చట్లు):**

కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం హుజురాబాద్ పట్టణంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హోటళ్లు, వాణిజ్య సంస్థల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలును పరిశీలించారు.

ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న 22 డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన సిలిండర్లను గోదాం అధికారులకు అప్పగించారు.

నిబంధనలు ఉల్లంఘించిన హోటల్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. 6ఏ చట్టం కింద కేసులు నమోదు చేయాలని సివిల్ సప్లై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తరహా తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




## సిరిసిపల్లిలో డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా అఖిలపక్ష నిరసన

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 23 (తెలంగాణ ముచ్చట్లు):**

హుజురాబాద్ శివారులోని సిరిసిపల్లి గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచనపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. సోమవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద అఖిలపక్ష ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

ఈ నిరసన దీక్షకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ భద్రతకు ముప్పుగా మారే డంపింగ్ యార్డ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల దుర్వాసనలు, కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి తక్షణమే నిర్ణయం మార్చుకోవాలని వారు కోరుతున్నారు.




## బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో చైర్మన్‌కు ఆత్మీయ సత్కారం

**జమ్మికుంట టౌన్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట పట్టణ పరిధిలో బ్రహ్మకుమారిస్ సంస్థ ఆధ్వర్యంలో చైర్మన్‌కు ఘనంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, బ్రహ్మకుమారిస్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆధ్యాత్మిక విలువలు వ్యక్తి జీవితానికే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. బ్రహ్మకుమారిస్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజల్లో సానుకూల మార్పుకు దోహదపడుతున్నాయని అభిప్రాయపడ్డారు.

చైర్మన్ తన ప్రసంగంలో బ్రహ్మకుమారిస్ సంస్థ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, ఐక్యత, సౌహార్దం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో విజయవం






## జమ్మికుంట 27వ వార్డులో సమస్యలపై చైర్మన్ పర్యటన

- గల్లీల పరిశీలన, ప్రజల సమస్యలపై అవగాహన
- సీసీ రోడ్లు, డ్రైనేజ్ సమస్యలపై ఫిర్యాదులు
- త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని హామీ

**జమ్మికుంట టౌన్, మార్చ్ 23 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట పట్టణ పరిధిలోని 27వ వార్డులో స్థానిక సమస్యలపై మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ శీలం శ్రీనివాస్‌తో కలిసి వార్డులోని పలు గల్లీలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రతి గల్లీ పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలతో నేరుగా మాట్లాడిన చైర్మన్, వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేకపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు తెలిపారు. అలాగే కొన్ని గల్లీల్లో డ్రైనేజ్ సౌకర్యం లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఇక మరికొన్ని ప్రాంతాల్లో శుభ్రత లోపం కారణంగా బయటకు వెళ్లడానికే ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోయారు. అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి కూడా అధ్వాన్నంగా ఉందని, చిన్నారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై స్పందించిన చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, వార్డులో సీసీ రోడ్లు మరియు డ్రైనేజ్ పనుల కోసం ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు తెలిపారు. పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, సిఎల్ఆర్పీ, గుల్లి, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల సంస్మరణ సభ నిర్వహణ

- భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల సంస్మరణ సభ

**ఏ ఎస్ రావు నగర్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం కమలానగర్ కార్యాలయంలో అమరవీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల సంస్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత స్వాతంత్ర పోరాటంలో వీరమరణం పొందిన వీరులకు 95 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ సభ ఏర్పాటు చేశారు.స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, ప్రముఖ కవిరచయిత బంగారు ఆచార్యులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల త్యాగం భారత స్వాతంత్ర్య పోరాటానికి దిశానిర్దేశం చేసిందన్నారు. భగత్ సింగ్ చిన్న వయస్సులోనే విప్లవ భావజాలాన్ని అలవరచుకుని, సమాజంలో చైతన్యం కలిగించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు.జలియన్‌వాలాబాగ్ ఘటన, లాలా లజపతిరాయ్‌పై జరిగిన లాఠీ చార్జ్ వంటి సంఘటనలు ఆయనను ఉద్యమ పంథాలో నడిపించాయని వక్తలు తెలిపారు. అమరవీరుల పోరాటం నేటి తరాలకు స్ఫూర్తి దాయకమని అన్నారు.జయరాజు ముగ్గురు యోధుల జీవిత విశేషాలను వివరించగా, నవతెలంగాణ రవి వీరులపై పాట పాడి సభను ఉత్తేజపరిచారు. గగన్ కుమార్, శారద, ఎం. భాస్కర్ రావు తదితరులు ప్రసంగించారు.అనంతరం సభ్యులు అమరవీరుల చిత్రపటాలకు పూలు సమర్పించి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్. శ్రీనివాస్, శోభ, లక్ష్మయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్, పూలే ఆశయాల సాధనే వారికి ఘన నివాళి

- వెనుకబడిన వర్గాలు ఏకమై రాజ్యాధికారానికి పోరాడాలి నాయకుల పిలుపు

**కీసర, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మరియు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈసీఐఎల్ బిఎంఎస్ యూనియన్ నాయకులు చింతలపూడి సుధీర్, కేతావత్ శారదా భాయి పిలుపునిచ్చారు.కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో మాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేద్కర్ 211వ జయంతి, పూలే జ్ఞానమాల కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన గురువు జ్యోతిరావు పూలే కలలు కన్న సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.యువత అంబేద్కర్ సూచించిన విద్య, చైతన్యం, హక్కుల పరిరక్షణ మార్గాల్లో ముందుకు సాగాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.వెనుకబడిన తరగతుల ప్రజలు ఏకమై రాజ్యాధికార సాధన కోసం పోరాడాలని తెలిపారు.సమసమాజ నిర్మాణమే మహనీయులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, మాల సంక్షేమ సంఘం నాయకులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చలో అసెంబ్లీ ముట్టడి విజయవంతం చేయండి

- గంటె ఉపేందర్,బిజెపి చిల్కూర్ మండల అధ్యక్షులు

**చిల్కూర్,మార్చి23(తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి, అరాచక, కమిషన్ పాలన ఆరోపణలు చేస్తూ బిజెపి శ్రేణులు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

బిజెపి రాష్ట్ర నాయకుల నేతృత్వంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ పిలుపునిచ్చారు. జనగాం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ ఆధ్వర్యంలో జరిగే ఈ ముట్టడికి పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో వంచించిందని ఆరోపిస్తూ, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యమని వివరించారు.

మార్చి 23న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ ఆధ్వర్యంలో చిల్కూర్ మండల బిజెపి నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు పెండ్యాల దిలీప్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, మండల ఎస్సి మోర్చా అధ్యక్షుడు కందుకూరు రజినీకార్, మండల నాయకులు సాదం భీమ్మన్న యాదవ్, కన్నెబోయిన అశోక్ యాదవ్, ముక్కెర రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'బస్తీ బాట' కార్యక్రమం న్యూ భవాని నగర్‌లో నెమలి అనిల్ కుమార్ పర్యటన

**మల్లాపూర్, మార్చి 23 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్‌లో "బస్తీ బాట" కార్యక్రమం భాగంగా కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ న్యూ భవాని నగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలను కలుసుకుని, వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు.ప్రధానంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజ్ వంటి ప్రాథమిక సౌకర్యాల కొరతపై ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని నెమలి అనిల్ కుమార్ హామీ ఇచ్చారు.ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారాలు అందించడం తన ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. బస్తీల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in